క్లుప్తంగా

పులి వీరన్నకు నివాళి

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ మంత్రి పులివీరన్న జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రం పద్మావతీకాలనీలోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా, నియోజకవర్గం అభివృద్ధికి పులివీరన్న చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులి అంజనమ్మ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

తపస్ ఉద్యమ కార్యాచరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తపస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19 వరకు వివిధ దశల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సంఘం అధ్యక్షుడు సునీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘాలకు అతీతంగా అందరూ ఒకేతాటి మీదకు రావాలని పిలుపునిచ్చారు.

ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన గులాం అహ్మద్ జహీర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, సాయిబాబా, అజ్మత్‌అలీ, పీర్ సాధిక్, మహ్మద్ అవేజ్, నాగరాజు, అలీం, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

టైర్ పగిలి వాహనం బోల్తా

బాలానగర్: టైర్ పగలడంతో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న బొలేరో కేతిరెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారిపై ఆదివారం బోల్తాపడింది. దీంతో డ్రైవర్ శివప్పకు గాయాలు అయ్యాయి. వాహనం పాక్షికంగా ధ్వంసమైంది. వాహన యాజమాని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆస్పత్రి పనులు పరిశీలించిన మంత్రి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పాత కలెక్టరేట్ స్థలంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌తో కలిసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం పరిశీలించారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనుకున్న సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత చంద్రశేఖర్ ఆజాద్

బాలానగర్: స్ఫూర్తిప్రదాత చంద్రశేఖర్ ఆజాద్ అని నాయకులు అన్నారు. ఆయన 117వ జయంతిని ఉడిత్యాల ఆజాద్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రామ పెద్దలు జగన్ పటేల్, రామకృష్ణ, నరేష్ గౌడ్, మల్లేష్, యాదయ్య పాల్గొన్నారు.

బాలగంగాధర్ తిలక్ జయంతి

స్టేషన్ మహబూబ్‌నగర్: విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో బాలా గంగాధర్ తిలక్ జయంతి నిర్వహించారు. క్లాక్‌టవర్ సర్కిల్‌లోని తిలక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బాలాగంగాధర్ తిలక్ జాతీయోద్యమన్ని దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లాడని కొనియాడారు. వినాయక చవితి వేడుకలతో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామంలో వేర్వేరు కుటుంబాలకు చెందిన వాకిటి శ్రీను, నడిమింటి భూదేవి మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. రూ.10వేలను పంపడంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఒక్కో కుటుంబానికి రూ.5వేలను అందజేశారు. సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ గణేష్, నాయకులు శ్రీధర్ యాదవ్, వెంకటేష్, యాదయ్య, శివ, నర్సింహ్మ, కాశన్న, కురుమూర్తి పాల్గొన్నారు.

దారులన్నీ బురదమయం



మహమ్మదాబాద్: ఎడతెరిపిలేని వర్షాలకు ఆయా గ్రామాల్లో గిరిజన తండాలకు వెళ్లే దారులన్నీ బురదమయంగా మారుతున్నాయి. దీంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. మండలపరిధిలోని పెద్దతండా, కుచ్చెమీదితండా, గుంగ్యాతండా, మంగంపేట్, బొట్లగడ్డ తండాలకు వెళ్లే దారులు మట్టిరోడ్లు కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కాలినడకన వెళ్లడానికి కూడా వీలు లేకుండా పోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరుతున్నారు.

రోడ్లు అధ్వానం



అధ్వానంగా రంగారెడ్డిపల్లి పరిగి రోడ్డు



గుంతలమయంగా లింగాయిపల్లి రోడు



కంకర వేసి వదిలేసిన రెడ్డిపల్లి-బల్బూర్‌గొండ రోడ్డు

గండేడ్: మండల పరిధిలోని పలురోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై, టెండర్లు కూడా పూర్తయినా ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోవడం లేదు. కొన్ని రోడ్లు ప్రారంభమై అసంపూర్తిగా మిగిలిపోగా, మరికొన్ని ప్రారంభానికే నోచుకోవడం లేదు. అధికారులు, కాంట్రాక్టర్లు మాత్రం నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని అయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రంగారెడ్డిపల్లి నుంచి పరిగి వేళ్లే రహదారిలో ..చెలిమ్ల గేటు వరకు 6.7 కిలోమీటర్ల రోడ్డు మండల పరిధిలో ఉంది. అధ్వానంగా మారిన ఈ రోడ్డు మరమ్మతుకు రూ.1.3 కోట్లు ఏడాది క్రితం మంజూరు చేశారు. టెండర్లు కూడా పూర్తయినా ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. దీంతో సరైన రవాణా సౌకర్యం లేకుండా పోతోందని ప్రజలు అంటున్నారు. పలుమార్లు నోటీసులు ఇచ్చినా కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదని చెబుతున్నారు.

పీఎంజీఎస్‌వై కింద రూ.3.716 కోట్లు 2021లో రెడ్డిపల్లి- బల్బూర్‌గొండ రోడ్డు నిర్మాణానికి మంజూరు అయ్యాయి. కానీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2022 డిసెంబర్ వరకే గడువు ముగిసినా ఇప్పటికీ పూర్తి కాలేదు. కంకర వేసి వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెన్నాచేడ్ నుంచి లింగాయిపల్లి వరకు రెండు కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.4కోట్లు రెండు నెలల క్రితం మంజూరయ్యాయి. కానీ ఇప్పటికీ పనులు చేపట్టలేదు. రోడ్డంతా గుంతలమయంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హామీ ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. కాగా చెల్మిల్ల గేటు నుంచి జిన్నారం తండా వరకు రోడ్డుకు రూ. 1.55 కోట్లు మంజూరయ్యాయి. కంకర వేసి ఏడాది గడుస్తున్నా బీటీ వేయడం లేదు. అదేవిధంగా మన్సూర్‌పల్లి రోడ్డుకు, మహమ్మదాబాద్ మండలం షేక్‌పల్లి రోడ్డు, ధర్మాపూర్ రోడ్లకు సైతం నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదు. మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి నుంచి అన్నారెడ్డిపల్లి తండా రోడ్డు కూడా కంకరతో దర్శనమిస్తోంది. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

గతుకుల రోడ్లతో ఇబ్బందులు పడుతున్నాం. కనీస మరమ్మతు కూడా చేపట్టడం లేదు. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చినా పనిచేయకపోతే బ్లాక్ లిస్టులో పెట్టాలి. అంతేకాని ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చోద్యం చూడడం తగదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పనులు చేపట్టాలి.

– గడ్డమీది రాఘవేందర్, వెన్నాచేడ్

త్వరలోనే ప్రారంభించేలా చూస్తాం

గండేడ్ మండలం ఇంతకుముందు నారాయణపేట ఆర్అండ్‌బీ డివిజన్‌లో ఉండేది. ఇటీవల మహబూబ్‌నగర్ డివిజన్‌కు మార్చారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. పనులు ప్రారంభించకపోతే నోటీసులు ఇస్తాం.

– సంధ్య, డీఈఈ, ఆర్అండ్‌బీ, మహబూబ్‌నగర్

హైవేపై అడుగుకో గుంత



మూసాపేట వద్ద గుంతల మయంగా జాతీయ రహదారి

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న 44వ నంబర్ జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. నాలుగైదు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు రహదారిపై ఉన్న గుంతల్లో వర్షం నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోల్కంపల్లి, గాజులపేట , చక్రాపూర్ స్టేజీలు, జానంపేట, మూసాపేట, కొమిరెడ్డిపల్లి, శాఖాపూర్ శివారులో రహదారిపై రెండు వైపులా గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతున్నాయి. రోడ్డుపై ఉన్న కంకర భారీ వాహనాలు వెళ్లినపుడు ఎగిరి పక్కన వెళ్తున్న వాహనాలపై పడుతోంది. దీంతో రహదారి నిర్వాహకులు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని డ్రైవర్లు పేర్కొంటున్నారు.

కూరగాయల సంత.. చినుకు చింత



నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం కూరగాయల సంతకు వర్షం ఇబ్బందులు తప్పలేదు. అటు రైతులు, ఇటు వినియోగదారులు తీవ్రంగా అవస్థలు పడ్డారు. వర్షం ఆగుతూ, వస్తూ ఉండడంతో గొడుగుల కిందే నిలిచారు. వర్షం దెబ్బకు సంత వెలవెల బోయింది. చాలా తక్కువ మొత్తంలో వినియోగదారులు సంతకు వచ్చారు. విక్రయాలు జోరుగా సాగలేదు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని పలు వార్డులను ఆదివారం సందర్శించారు. అధికారులకు, పాలకులకు రోడ్లపై సరైన ముందుచూపు లేదని విమర్శించారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు, పాలక మండలి సభ్యులు సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ రాజు, పట్టణశాఖ అధ్యక్షుడు నాగరాజు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు అనంతకిషన్, మధు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై కేంద్రానిదే బాధ్యత



నిరసన తెలుపుతున్న నాయకులు

గండేడ్: మణిపూర్‌లో జరుగుతున్న అమానవీయ ఘటనలకు కేంద్రమే బాధ్యత వహించాలని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘటనలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆశన్న పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌లో...

మణిపూర్ ఘటనపై మాజీ ఎంపీపీ శాంతీబాయి ఆధ్వర్యంలో మహమ్మదాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఫల్యమే ఘటనలకు కారణమన్నారు. మండల నాయకులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మణిపూర్‌లో మహిళలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేష్, కె.రవికుమార్ డిమాండ్ చేశారు. అక్కడ జరిగిన ఘటనలను నిరసిస్తూ ఆదివారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణచౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించాలన్నారు. అల్లర్ల అణిచివేతకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.కిష్టయ్య, శ్రీనివాసులు, సృజన, జిల్లా ఉపాధ్యక్షురాలు పి.ఉమాదేవి, కోశాధికారి వి.భాస్కర్, కార్యదర్శులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌చౌరస్తాలో నిరసన ప్రదర్శన చేపట్టిన నాయకులు

కులమతాలకు అతీతంగా మొహర్రం



బాలానగర్: మొహర్రం నేపథ్యంలో సేరిగూడలో గ్రామస్తులు కందూర్ నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా పీర్ల వద్ద ఆడిపాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొహర్రం కులమతాలకు అతీతంగా నిర్వహించుకునే పండుగ అన్నారు. సర్పంచ్ శంకరప్ప, కృష్ణా రెడ్డి, సమీరుల్లా, లింగం , వెంకట్ రెడ్డి, వేణు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆల



భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో ఆదివారం కూరగాయల సంతలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విక్రయదారులకు గొడుగులను పంపిణీ చేశారు. సోమవారం మంత్రి కేటీఆర్ జన్మదినం నేపథ్యంలో, గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో గొడుగులు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజు గౌడ్ , మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, విండో చైర్మన్ కదిరె శేఖర్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

అంతిమ పోరాటానికి సిద్ధంకండి



జడ్చర్ల టౌన్: హైదరాబాద్‌లో ఆగస్టు చివరివారం నిర్వహించనున్న విశ్వరూప మహాసభకు సంబంధించి జూలై 30న జడ్చర్లలో సన్నాహక సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్‌మాదిగ వెల్లడించారు. ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. వర్గీకరణ ఆశయ సాధనలో అంతిమ పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. మందకృష్ణ మాదిగ రానున్నట్లు వివరించారు. ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజు, కోకన్వీనర్ వినోద్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కావలి కృష్ణయ్య అన్నారు. హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమంపై ఆదివారం బోయపల్లిలో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభను లక్షలాదిగా తరలిరావాలన్నారు. కొండయ్య, శ్రీరాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎంఈఎఫ్ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ కె.సువార్తమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. విశ్వరూప మహాసభకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకేపోగు రాములు, గాలి యాదయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కావలి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి కొండన్న పాల్గొన్నారు.

చెక్‌డ్యాంలకు జలకళ



అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు జలకళ ఏర్పడుతోంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వాగుకు స్వల్ప వరద వస్తోంది. మూసాపేట మండలం నిజాలాపూర్ వద్ద పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాం శనివారం రాత్రి నుంచి అలుగు పారుతోంది. సంకలమద్ది, గౌరిదేవిపల్లి, పొన్నకల్, పేరూరు, ముత్యాలంపల్లి, బలీదుపల్లి శివారుల్లోని చెక్‌డ్యాంలను దాటి వరద నీళ్లు దిగువన ఉన్న సరళాసాగర్ ప్రాజెక్టుకు వెళ్లాల్సి ఉంది. అయితే ఉధృతి పెద్దగా లేకపోవడంతో వాగు పూర్తిస్థాయిలో పారడం లేదు. కాగా శాఖాపూర్ చెరువు వరద నీటితో నిండుతోంది.

బోయిన్‌పల్లిలో కూలిన ఇల్లు



మిడ్జిల్: ఎడతెరిపి లేని వానలకు మండల పరిధిలోని బోయిన్‌పల్లి గ్రామంలో అతరమోని లక్ష్మమ్మ ఇల్లు ఆదివారం కూలీపోయింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. లక్ష్మమ్మ కుమారులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కాగా భర్తతో కలిసి ఆమె ఇక్కడే ఉంటున్నారు. ఇల్లు కూలీ పోవడంతో ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

'మా కుటుంబాలను మంత్రి ఆదుకున్నారు'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తమ కుటుంబాలను ఆదుకున్నారని హన్వాడ మండలం చిరుమల్ కుచ్చ తండాలో ఇటీవల నీటిగుంతలో పడి ప్రమాదవశాత్తు మృతిచెందిన చిన్నారులు గణేష్, శివల తల్లిదండ్రులు తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితి తెలుసుకుని రెండు కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇచ్చారని వివరించారు. కానీ కాంగ్రెస్ నేతలు రాజకీయంగా వాడుకుని ఇబ్బంది పెట్టాలని ప్రయత్నించారని ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు కేలూత్ గోపి, శాంతిబాయ్, ముడావత్ రవి, సోనీబాయిలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఖురాన్ వారోత్సవాలు



మాట్లాడుతున్న మహమూద్ బాబు

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం జమాత్ ఫజల్ ఉమర్ మసీద్‌లో పవిత్ర ఖురాన్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జమాత్ అధ్యక్షుడు మహమూద్ అహ్మద్ బాబు మాట్లాడారు. ఖురాన్ ప్రపంచ శాంతిస్థాపనను సూచిస్తుందన్నారు. విశ్వ వ్యాప్తంగా సర్వ ధర్మ అవతార పురుషులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే శాంతి నెలకొల్పవచ్చన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కుట్రలను తిప్పికొట్టాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బహుజన వీరుడు పండుగ సాయన్న చరిత్రను బయటకు రాకుండా కొన్ని వర్గాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని హన్వాడ ఎంపీపీ బాల్‌రాజ్, కళాకారుల సంఘం నాయకులు కిందింటి కిరణ్, అంజన్న అన్నారు. పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకుని ఆదివారం హన్వాడలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పండుగ సాయన్న చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద, అలాగే అన్ని గ్రామాల్లోనూ ఆయన విగ్రహాలను ఆవిష్కరించాలన్నారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, జయంతి, వర్ధంతిని అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘాల జేఏసీ నాయకులు లక్ష్మయ్య, బాలగోపి, పల్లెమోని యాదయ్య, వేపూరు నర్సింహులు, టంకర శంకర్, సల్లోనిపల్లె రాములు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాల్సిందే..

భూత్పూర్: సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తీవ్రతరం చేస్తామని పంచాయతీ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ పాలడగు సుధాకర్ అన్నారు. ఆదివారం భూత్పూర్‌లో సమ్మెకు మద్దతు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో చర్చలు జరపామన్నారు. సమ్మె విరమిస్తే వేతనాల విషయం, డిమాండ్‌పై చర్చించి పరిష్కరించుకుందామని ఆయన తెలిపారని వివరించారు. కాగా 27న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడి ఉంటుందని కార్మికులు జయప్రదం చేయాలని అన్నారు. పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేష్ గౌడ్, నాయకులు ఉన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో ఆదివారం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.